క్లుప్తంగా

బీటెక్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఇల్లెందు: కొత్తగూడెంలోని కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో సింగరేణి అధికారులు, ఉద్యోగుల పిల్లలకు బీటెక్‌లో ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలకు పది సీట్లు కేటాయించగా, మైనింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో రెండేసి సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు హాల్‌టికెట్, ర్యాంకు, కుల, నివాస ధ్రువపత్రాలతో పాటు వారి తండ్రి ఉద్యోగి ఐడీ కార్డుతో ఈ నెల 30లోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

చింతలచెర్వు కట్టపై నేలకూలిన స్తంభాలు


కట్టపై నేలకూలిన విద్యుత్ స్తంభం

పాల్వంచ: పట్టణంలోని చింతల చెర్వు కట్టపై ఇటీవల మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అయితే, కట్టపై రోడ్డును విస్తరిస్తుండగా, కట్ట పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలు అక్కడక్కడా పడిపోయాయి. దీంతో కట్టపై అంధకారం అలముకుంటోంది. కట్టపై నిత్యం వాకింగ్ చేసేందుకు ఉదయం, సాయంత్రం ప్రజలు వస్తున్నందున అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తా..


ప్రచారం నిర్వహిస్తున్న శ్రీనివాస్ నాయకులు


జూలూరుపాడు: ఆర్యవైశ్యుల అభివృద్ధి, అభ్యున్నతి కోసం కృషి చేయనున్నట్లు ఆర్య వైశ్య మహాసభ నాయకుడు పల్లపోతు శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 16న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్ష ఎన్నిక జరగనుండగా పోటీ పడుతున్న ఆయన సోమవారం జూలూరుపాడు వచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఆయన వెంట పల్లపోతు సాయిబాబా, వారనాసి సురేశ్, వందనపు సత్యనారాయణ, శ్యామ్‌ప్రసాద్, మహంకాళి గోపాలకృష్ణ, పెండ్యాల కిరణ్, పెండ్యాల జగన్నాథం పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

జూలూరుపాడు: నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మెడికల్ కళాశాలల్లో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పేపర్, ఫలితాల అవకతవకలపై విచారణ చేయాలన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన విషయమని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జిచే విచారణ చేయించాలని ఆయన కోరారు.

ఇఫ్టూ ఏరియా కమిటీ ఎన్నిక


పాయం వెంకన్న


మల్లెల వెంకటేశ్వర్లు

ఇల్లెందు: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఇఫ్టూ ఇల్లెందు ఏరియా కమిటీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందులో ఇఫ్టూ ఏరియా కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అందుకోసం పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక వివరాలు వెల్లడించారు. ఉపాధ్యక్షులుగా కె.వీరన్న, సహాయ కార్యదర్శిగా వేముల గురునాథం, కోశాధికారిగా శేషయ్యతోపాటు 16 మందితో కూడిన నూతన కమిటీ ఎన్నికైనట్లు తెలిపారు.

పూర్వ వైభవం తీసుకొస్తారా?

శిథిలావస్థలో టీటీడీ కల్యాణ మండపం

- గతంలో కొన్నేళ్లు లీజ్‌లతో కొనసాగింపు
- ప్రస్తుతం టీటీడీ ఆధీనంలోనే ఉన్నా తెరుచుకోని వైనం
- నిర్వహణ లోపాలతో శిథిలమైన భవనం
- నూతన భవనం నిర్మిస్తే సామాన్యులకు అందుబాటులోకి..


కొత్తగూడెంలోని టీటీడీ కల్యాణ మండపం


మండపం ఆవరణలో విశాలమైన ఖాళీ స్థలం

కొత్తగూడెంఅర్బన్: పెళ్లిళ్లు, శుభకార్యాలు, హోమాలు, పూజలు, సమావేశాలతో నిత్యం హడావిడి, సందడితో కళకళలాడిన కళ్యాణ మండపం ప్రస్తుతం శిథిలావస్థకు చేరిబోసిపోయి కనిపిస్తోంది. ఆరేళ్లుగా అక్కడ ఏ కార్యక్రమాలు జరుగకపోవడంతో వెలవెలబోతోంది. కొత్తగూడెం పట్టణ పరిధి ఫ్యూన్‌బస్తీ ఏరియాలోని టీటీడీ కల్యాణ మండపానికి గతంలో ఎంతో వైభవం ఉంది. ఇది దాదాపు మూడు ఎకరాల్లో విస్తరించి ఉంది. మండపం నిర్మాణం జరిగినప్పటి నుంచి కొన్నేళ్లుగా టీటీడీ వారే నిర్వహణ బాధ్యత తీసుకున్నారు. అనంతరం కొత్తగూడెంలోని వివిధ సంస్థలు, ఆలయాల వారికి లీజ్‌కు ఇచ్చారు. ఈ క్రమంలో 2008లో సింగరేణి మెయిన్ ఆస్పత్రి సమీపంలోని శ్రీ కనుకదర్గ చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానం వారు మండపాన్ని లీజ్‌కు తీసుకున్నారు. అప్పటి నుంచి 2018 వరకు వారి ఆధీనంలోనే ఉండగా.. ఆపై తిరిగి టీటీడీకి అప్పగించారు.

కరోనాతో మూత

టీటీడీ ఆధ్వర్యంలోకి మండపం వచ్చిన తర్వాత కరోనా విజృంభనతో 2020లో మూతపడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు తెరుచుకోలేదు. మధ్యలో టెండర్ పిలవగా.. దక్కించుకున్న వారు మండపం నిర్వహించలేమని చేతులెత్తేశారు. దీంతో అప్పటి నుంచి మండపం బోసిపోయి కనిపిస్తోంది. అంతేకాక భవనం శిథిలావస్థకు చేరింది. ఆ మండపం ఉన్న స్థానంలో నూతన భవనాన్ని నిర్మిస్తే సామాన్య ప్రజలకు తక్కువ ధరలో కల్యాణ మండపం అందుబాటులోకి వస్తుంది. ఆ దిశగా టీటీడీ వారు చొరవ తీసుకుని కొత్తగూడెంలో మండపాన్ని పునర్నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తక్కువ ధరతో అద్దెకు..

టీటీడీ కల్యాణ మండపంలో సామాన్య ప్రజలు, పేద వారు తక్కువ ధరతో పెళ్లిళ్లు, శుభ కార్యక్రమాలు, సమావేశాలు గతంలో నిర్వహించుకునేవారు. ప్రస్తుతం టీటీడీ కల్యాణ మండపం శిథిలావస్థకు చేరి నడవకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బయట ఫంక్షన్ హాళ్లకు వేలు, లక్షల్లో రెంట్లు ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. గతంలో టీటీడీ కల్యాణ మండపంను రూ.2 వేల రెంట్‌కు ఇచ్చేవారు. ప్రస్తుతం నాన్ ఏసీ ఫంక్షన్‌హాల్ రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఒక్క రోజుకు రెంట్ వసూలు చేస్తున్నారు. అదే ఏసీ అయితే రూ.30 నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. కల్యాణ మండపంలో దాదాపు 300 మంది పట్టే హాల్, బయట ప్రాంగణంలో వేల మంది వరకు పట్టే స్థలం ఉంది. టీటీడీ వారు చర్యలు చేపట్టి కల్యాణ మండపం స్థానంలో నూతన భవనం నిర్మించి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. లేదా మున్సిపల్ అధికారులు లీజుకు తీసుకొని నిర్వహిస్తే మున్సిపాలిటీకి అదనంగా ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.

నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

కొత్తగూడెంలో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలను గతంలో టీటీడీకి పంపించారు. ఈ క్రమంలో టీటీడీ నుంచి ఇంజనీరింగ్ అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారని తెలిసింది. ఇకనైనా కొత్తగూడెంలో పాత టీటీడీ కల్యాణ మండపంను తొలగించి, కొత్త భవన నిర్మాణం చేస్తే పూర్వ వైభవం వస్తుంది. ఆ దిశగా టీటీడీ అడుగులు వేయాల్సిన అవసరముంది. పట్టణంలో పెళ్లిళ్లు, వివిధ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించడానికి తక్కువ ధరకు దొరికే ఫంక్షన్ హాళ్లు, ఆడిటోరియాలు కరువయ్యాయి. గతంలో పట్టణ పరిధిలోని సెవెన్‌హిల్స్ ఏరియాలో ఉన్న శ్రీరామచంద్ర ఆడిటోరియం కూడా తక్కువ రెంట్‌కు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ఆ ఆడిటోడియం కూడా శిథిలావస్థకు చేరడంతో మూతపడింది.

నూతన భవన నిర్మాణానికి చర్యలు

కొత్తగూడెంలో టీటీడీ కల్యాణ మండప భవనం శిథిలావస్థకు చేరింది. దాని స్థానంలో నూతన భవనం నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఆ దిశగా ఇంజనీరింగ్ విభాగం వారు వచ్చి పరిశీలించి వెళ్లారు. ఇది కార్యరూపం దాలిస్తే పట్టణ ప్రజలకు ఫంక్షన్ హాల్ అందుబాటులోకి వస్తుంది.

–హరీశ్, టీటీడీ కల్యాణ మండపం మేనేజర్

వ్యక్తిత్వ వికాస శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: రెండు రోజుల పాటు నిర్వహించే ఉచిత సంపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ×స్టెప్‌=నిర్వాహకులు కోరారు. కొత్తగూడెంలోని ప్రకృతి ఆశ్రమంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఈ నెల 16, 17వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఉచిత శిక్షణ ఇవ్వనుండగా, భోజన వసతి కల్పించి మెటీరియల్, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, డాక్టర్ బత్తుల కృష్ణయ్య నేతృత్వాన ఈ శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు 99631 88715, 95504 79388 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో స్టెప్ జిల్లా కోఆర్డినేటర్ జి.సుగుణారావు, సభ్యులు ఎండీ ముస్తఫా, బంగారి శంకర్, మొక్కల రాజశేఖర్, గడ్డం రాజశేఖర్, సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.ఙ

చట్టాన్ని అమలు చేయాలి

పాల్వంచరూరల్: ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యా హక్కు చట్టం –2009ని పటిష్టంగా అమలు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని నాగారంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో విద్యను వ్యాపారంగా మార్చారని, ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే చర్యలు చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయల భాస్కర్, నాగేంద్రబాబు, సాయి, నరకట్ల దుర్గాప్రసాద్, సిద్దుల సుధీర్ పాల్గొన్నారు.

రవికిరణ్ మృతికి సంతాపం

ఇల్లెందు: ఏఐఎస్ఎఫ్ కార్యకర్త రవికిరణ్ మృతి విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా.. సోమవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట డి.శంకర్, బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, కె.రవీందర్, బొల్లి కొమురయ్య, మోజేశ్, సదానందం, వడ్ల శ్రీనివాస్, మన్నాన్‌తోపాటు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ నివాళులర్పించారు.

కొనసాగుతున్న 'బడి బాట'


జూలూరుపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు


ఇల్లెందురూరల్: ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

జూలూరుపాడు: బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జూలూరుపాడు ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి చంద్రుగొండ క్రాస్ రోడ్ వరకు అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సెర్ప్ ఉద్యోగులు, గ్రామ సమాఖ్య సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విద్యాబోధన చేస్తున్నారని, కార్పొరేట్ స్థాయిలో విద్య అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సంజీవరావు, హైస్కూల్ హెచ్‌ఎంలు లక్ష్మీనర్సయ్య, ఎస్కే మీరాసాహెబ్, సెర్ప్ ఏపీఎం సత్యనారాయణరాజు, సీసీలు మధుసూదన్‌రావు, డి.నాగేశ్వరరావు, రామారావు తదతరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: పట్టణంలోని కొత్తకాలనీలో సోమవారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పిల్లలను బడికి పంపించాలని ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని 13వ వార్డు కౌన్సిలర్ కడకంచి పద్మ, కొత్తకాలనీ పాఠశాల హెచ్‌ఎం హేమలత కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయకుమారి, మల్లికాంబ, నాగమణి, వెంకటలక్ష్మి, మణిమాల, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఇల్లెందు మండలంలో..

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బడి బాట ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

పాల్వంచరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు నిర్వహించారు. నాగారం, నారాయణరావుపేట, సంగం గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారం హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు.

ఇంటింటి సర్వే ప్రారంభం


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్

చుంచుపల్లి: మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించి మండలంలో ఇంటింటి సర్వే సోమవారం ప్రారంభమైంది. పంచాయతీ కార్యదర్శి, బిల్ కలెక్టర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో లాగిన్ ద్వారా రోజుకు 400 ఇళ్లలో సర్వే చేయనున్నారు. చుంచుపల్లి మండలంలోని బాబూక్యాంప్, ఎన్‌కే నగర్, చుంచుపల్లి తండా, నందా తండాల్లో సర్వేను ఎంపీడీఓ వాసిరెడ్డి అశోక్‌కుమార్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం, జూలూరుపాడు, కొమ్ముగూడెం, గుండెపుడి గ్రామాల్లోని విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో సోమవారం వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఇల్లెందు సహాయ వ్యవసాయ సంచాలకులు పి.వాసవీరాణి, జూలూరుపాడు ఏఓ ఎస్.రఘుదీపిక ఆధ్వర్యాన తనిఖీలు చేసి స్టాక్ రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు. వ్యాపారులు ప్రతీ అమ్మకంపై రైతులకు పూర్తి వివరాలతో రశీదు ఇవ్వాలని సూచించారు.


దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

పాఠశాలలో పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ 35వ వార్డులోని కూలీలైన్ ప్రైమరీ, హైస్కూళ్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా ఎంపికైన పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చేపడుతున్న పనుల్లో నాణ్యత పాటిస్తూ పాఠశాల తెరిచే నాటికి పూర్తిచేయాలని సూచించారు. లాల్‌సింగ్, మునిగ సుజాత, భాస్కర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు తవ్వడంతో అవస్థలు

టేకులపల్లి: అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రెండు నెలల కిందట మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్లు వేశారు. ఇందుకోసం సీసీ రోడ్డును తవ్వి ఒక వీధి నుంచి ఇంకో వీధికి పైపులు వేశారు. నిబంధనల ప్రకారం రోడ్డు తవ్వాల్సి వచ్చినప్పుడు ఎంపీడీఓ, ఎంపీఓ, కార్యదర్శుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఎవరైనా రోడ్డుని తవ్వినప్పుడు యథావిధిగా తిరిగి రోడ్డుని నిర్మించాల్సి ఉంటుంది. సంబంధిత శాఖ అధికారుల పట్టింపు లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా సీసీ రోడ్డుని తవ్వి అడ్డగోలుగా పూడ్చి వెళ్లిపోయాడు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కొందరు అదుపుతప్పి కింద పడిన ఘటనలు కూడా ఉన్నాయి.

దేశ ప్రజల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న బుడగం రవికుమార్

పాల్వంచరూరల్: భారతదేశ ప్రజల అభ్యున్నతికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తారని బీజేపీ నాయకుడు బుడగం రవికుమార్ అన్నారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పట్టణంలో సోమవారం బీజేపీ నాయకులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. గడిచిన పదేళ్లలో అత్యుత్తమ పాలన అందించిన నరేంద్రమోదీకి ప్రజలు మూడోసారి పట్టం కట్టారని తెలిపారు. వరుసగా మూడు సార్లు అధికారంలోకి వచ్చి నరేంద్రమోదీ రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం రానున్న రోజుల్లో అనేక కార్యక్రమాలు చేపట్టనున్నారని వివరించారు. కాగా ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల్లో సాగింది. కార్యక్రమంలో నాయకులు రాజు, వీరన్న, కాల్వప్రసాద్, సుధాకర్, శ్రీనివాస్, రహీమ్, సలీం, వైకుంఠం, నర్సింహనాయుడు, శంకర్, రమణ, ఈశ్వర్, సూరిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలోని మైనార్టీ విద్యార్థుల కోసం గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని మైనారిటీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 204 మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలల్లో సుమారు 8 వేల మంది ఏటా ఉత్తీర్ణత సాధిస్తుండగా, వారి కోసం గురుకుల డిగ్రీ కళాశాలలు లేనందున చాలామంది చదువు మానేస్తున్నారని తెలిపారు. అయితే, గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసినా మైనార్టీలను విస్మరించినందున ఈ ప్రభుత్వమైనా స్పందించాలని ఆయన కోరారు.

చట్టాలను విస్మరిస్తున్న పాలకులు



మాట్లాడుతున్న సంధ్య

ఇల్లెందురూరల్: మహిళా చట్టాలను పాలకులు విస్మరించడం వల్లనే సమాజంలో మహిళలు చిన్న చూపునకు గురవుతున్నారని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సంధ్య, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సుభాష్‌నగర్‌లో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో మహిళలకు జిల్లా స్థాయి శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై దాడులు, లైంగికదాడులు, వేధింపులు పెరిగిపోయాయయని, రేపిస్టులు, హంతకులను పాలకులు రక్షిస్తున్నారని ఆరోపించారు. పార్టీ పుస్తకాల్లో, ప్రసార సాధనాల్లో హిందుత్వ ఫాసిస్టు భావజాలాన్ని మహిళలకు ఎక్కిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు నోముల కళావతి, ఉపాధ్యక్షురాలు పెద్దగోని ఆదిలక్ష్మి, ప్రధాన కార్యదర్శి బయ్యా శారద, కార్యదర్శి మోకాళ్ల సుగుణ, కల్తీ రాములమ్మ, రేశ్ల నాగలక్ష్మి, సంధ్య, భూలక్ష్మి, రాధ, చిన్నపద్మ, మేఘన, సూర్యకాంత పాల్గొన్నారు.

ఈ ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

పాల్వంచరూరల్: కొత్తగూడెం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదితానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. పాల్వంచ మండలం సీతానగర్‌కాలనీ, నాగారంకాలనీ, రంగాపురం గ్రామల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సపావత్ వెంకటరమణ, సుంకర రంగారావు, తేజావత్ వినోద్, మాలోతు హరి, తేజావత్ ప్రసాద్ ఆధ్వర్యాన పలువురు సీపీఐలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే కొత్తగూడెంనకు ప్రత్యేక స్థానం ఉందని, అందుకు అనుగుణంగా అభివృద్ధి చేస్తానని, ప్రజలకు సీపీఐ శ్రేణులు అండగా ఉండి సమస్యల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

కొత్తగూడెంరూరల్: జిల్లా కళాకారులతో నిర్మించిన 'నర్మద' సినిమా ప్రివ్యూ మంగళవారం కొత్తగూడెంలోని పీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ మేరకు సినిమా బాధ్యులు సోమవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలోని కళాకారులు సినిమా తీయడం ఆనందంగా ఉందని, జిల్లావాసులు సినీ రంగంలో మరింత ఎదగాలని ఆకాంక్షించారు. సినీ నిర్మాత ఆళ్ల రాఘవ, చిత్ర సమర్పకులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, దర్శకులు సుధాకర్, నటుడు తాండూర్ ధనరాజ్, గాయకుడు అల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సినిమా బృందం

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి


నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, యాజమాన్యం తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రీజియన్ కార్యదర్శి ఎర్రగాని కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ఇల్లందు గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీఓ నంబర్ 22ను అమలు చేయాలన్నారు. ఎన్నికల ముందు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై దృష్టి సారిస్తామన్న పాలకులు ప్రభుత్వం ఏర్పడి సుమారు ఆరు నెలలైనా జీఓను అమలు చేయడం లేదని చెప్పారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, విష్ణు, రాము, రమేశ్, అన్వర్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి


ఉద్యమకారులతో మైనార్టీ సెల్ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ తొలి దశ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకుడు నయీమ్ ఖురేషి కోరారు. కొత్తగూడెంలోని ఉర్దూఘర్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో 1969 ఉద్యమంలో పాల్గొన్న వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఖురేషి మాట్లాడుతూ ఉద్యమకారులను గౌరవించుకోవడం ఆనందంగా ఉందని, వారికి పింఛన్, ఆరోగ్యశ్రీ కార్డు, బస్ పాస్, ఇంటి స్థలం, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా వారికి అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమలో 1969 ఉద్యమకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణబోయిన నర్సయ్య, వాలీబాబాతోపాటు రజాక్, పాషా, మహమ్మద్ షరీఫ్, జావీద్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.